క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మేళ్లచెరువు మండలంలోని రామాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా చింతలపాలెం మండలంలోని దొండపాడు, బుగ్గమాదారం, వజినేపల్లి, గుడిమల్కాపురం, పులిచింతల ప్రాజెక్టు కాలనీ, వెల్లటూరు, చింతలపాలెం, తమ్మారం గ్రామాలకు బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ హారిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆమె కోరారు.

రేపు రామాలయంలో మండల పూజ

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో ఈనెల 30వ తేదీన మండల పూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గోపూజ, గణపతి పూజ, నవగ్రహ ఆరాధన, పుణ్యావచనం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, మూల మంత్ర సహిత సుదర్శన హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భక్తులకు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు, పాల్గొన్న భక్తులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గల అభయాంజనేయస్వామి మందిరంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు వల్లభనేని కోటేశ్వరరావు, సీతమ్మ, వీరయ్య, పద్మావతి, కార్తీక్, సైదారావు, రాజారావు రాజకుమారి రంగారావు, పార్వతి, కమిటీ అధ్యక్షులు జుకూరి అంజయ్య, తిరపతయ్య తదితరులు ఉన్నారు.

వెంకయ్య ఆశయ సాధనకు కృషిచేయాలి



వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : స్వాతంత్య్ర సమరయోధుడు కడియాల వెంకయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గరిడేపల్లి మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వెంకయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, కట్టా నర్సింహారావు, ఈదా భిక్షం, మెండే సైదులు, ఈదా బుచ్చయ్య, గోధుమల ఈశ్వరాచారి, పోకల ఆంజనేయులు, సాంబయ్య, పంగ గోవిందు, తాళ్ల తిరపయ్య, కాశయ్య, ఆకుల శ్రీను, ఈదా చిన్న భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ



ఆకుపూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, క్షేత్రపాలకుడికి పంచామృతాలతో అభిషేకం, ఆకుపూజ, అష్టోత్తర శతమావళి సహస్రనామ ఫల పుష్పార్చన, గోత్రనామార్చన, ఆరగింపు, మంగళాశాసనం, పాశుర ఉచ్చరణ, తీర్థప్రగోష్ఠి వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఓ వెంకటచలపతి, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆల య సిబ్బంది, కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చిలుకూరు : విద్యుదాఘాతంలో పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం చిలుకూరు మండల పరిధిలోని రామాపురం గ్రామంలో జరిగింది. బాధిత రైతు వేమూరి శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే మేత కోసం పొలాలకు వెళ్లిన గేదె విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- కంకర తేలిన హేమ్లాతండా–రేవూరు రహదారి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీగా మార్చాలని వేడుకోలు



కంకర తేలిన హేమ్లాతండా - రేవూరు రోడ్డు

మేళ్లచెరువు : మండలంలోని హేమ్లాతండా నుంచి రేవూరు వరకు దాదాపు ఐదు కిలోమీటర్లు గల మెటల్ రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డు పూర్తిగా కంకరతేలి నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ రోడ్డు గుండా హేమ్లాతండా గ్రామపంచాయతీ పరిధిలోని జగ్లుతండా, రాఘవాపురం, హేమ్లాతండా, సాధుతండా గ్రామాల ప్రజలు రేవూరు వరకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. తమ పొలాలకు కూడా ఈ రోడ్డు మార్గంలోనే వెళ్లి వస్తుంటారు. రోడ్డుపై మట్టి పూర్తిగా తొలగిపోయి కంకర తేలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై మొరం తోలించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని రైతులు తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. కనీసం మనుషులు, పశువులు కూడా నడవలేని స్థితిలో రోడ్డు ఉందని చెబుతున్నారు. ఇక ద్విచక్రవాహనాలు వెళ్లినా క్షేమంగా ఇళ్లు చేరుతారనే నమ్మకం లేదు. ఈ రోడ్డులో సైకిల్, బైక్ పై నుంచి కిందపడి ఎంతో మంది గాయాలపాలయ్యారు. అయితే ఈ లింక్ రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వం హయాంలో కోటి రూపాయల నిధులు మంజూరైనా కాంట్రాక్టర్‌లు ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు చొరవ చూపి బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

రోడ్డుపై మట్టి పోయాలి

హేమ్లాతండా – రేవూరు రోడ్డులో కనీసం మనుషులు, పశువులు నడిచే పరిస్థితి కూడా లేదు. పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుపై కనీసం మట్టి అయినా పోయాలి. బీటీ రోడ్డుగా మార్చితే బాధలు తీరుతాయి.

– ధారావత్ సక్యానాయక్, హేమ్లాతండా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం





హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

మునగాల : హనుమాన్ జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని మునగాల మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో మంగళవారం రాత్రి సుందరకాండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన హనుమాన్ భక్తుడు నల్లపాటి శ్రీనివాస్ -ప్రమీల దంపతుల సహకారంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తూముల వీరస్వామి, కార్యదర్శి గంధం అంజయ్య, కోశాధికారి మీసేవ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత



క్రీడా దుస్తులు అందజేసిన హెచ్‌ఎం బ్రదర్ వినోద్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని మాంట్‌ఫోర్డు (వీవీహెచ్‌ఎస్) పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో పాల్గొన్న 44 మంది విద్యార్థులకు అదే స్కూల్‌లో 1999- 2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థి వి.రాజేష్ రూ.20వేల విలువ గల క్రీడా దుస్తులను మంగళవారం పాఠశాల హెచ్‌ఎం.బ్రదర్ వినోద్‌రెడ్డి, పీఈటీ సతీష్, పూర్వ విద్యార్థులు గంగసాని ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామ్మూర్తి, జోస్‌గౌడ్, మల్లారెడ్డిలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి




కరుణసాగర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

మోతె : మండల పరిధిలోని బుర్కచర్ల గ్రామ మాజీ సర్పంచ్ దాచపల్లి కరుణసాగర్‌రెడ్డి (65) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కాగా, కరుణసాగర్‌రెడ్డి మృతదేహాన్ని కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఎం పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ ముప్పాని ఆశ, జెడ్పీటీసీ పుల్లారావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు, మాజీ ఎంపీపీ బానోతు జాన్సీశంకర్, తదితరులు ఉన్నారు.

నగదు పొందేందుకు గొల్లకురుమల దరఖాస్తులు

అర్వపల్లి : రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం ఏడాది కిందట తమ వాటా కింద రూ.43,750 చొప్పున డీడీలు చెల్లించిన గొల్లకురుమలు తిరిగి నగదును పొందేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో రెండో విడతలో 321మంది గొల్ల కురుమలు ప్రభుత్వానికి డీడీలు తీసి పంపారు. వారిలో 99మందికి అప్పట్లో గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. ఇంకా 222మందికి యూనిట్లు రావాల్సి ఉంది. అయితే ప్రభుత్వం మారడంతో ఈ పథకాన్ని నిలిపివేశారు. డీడీ తీసినా గొర్రెల యూనిట్లు రానివారు తిరిగి తమ డబ్బును పొందేందుకు అర్వపల్లిలోని పశువైద్యశాలలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 208మంది గొల్ల కురుమలు దరఖాస్తులు చేసుకున్నారని మరో 14మంది చేసుకోవాల్సి ఉందని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్ తెలిపారు. గొర్రెల కోసం మండలంలో దరఖాస్తు చేసుకున్న వారికి గతంలో వారు చెల్లించిన వాటాధనం సొమ్ము తిరిగి వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరుగుతుందని ఆయన చెప్పారు.

పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

భానుపురి : గ్రూప్స్, డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడే విలువైన పుస్తకాలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఎస్. వెంకటరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. గ్రంథాలయంలో అందిస్తున్న వసతులపై అడిగి తెలుసుకున్నారు. గ్రూప్స్, డీఎస్సీ పరీక్షల సమయం దగ్గరలో ఉన్నందున విజయావకాశాలు చేరాలంటే చదువుపై ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు. గ్రంథాలయంలో బోర్ అవసరం ఉందని సిబ్బంది తెలపగా ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. గ్రంథాలయాన్ని ఉదయం 8 నుంచే అభ్యర్థులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. గ్రంథాలయాన్ని శుభ్రంగా విద్యార్థులకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంచుతున్న గ్రంథాలయ ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సెక్రటరీ సీతారామశాస్త్రి, ఉద్యోగులు రంగారావు, శ్యాంసుందర్ రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను కమ్మేసిన కంపచెట్లు

- లోఓల్టేజీ విద్యుత్‌తో ఇబ్బందులు



బేతవోలులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కమ్మేసిన కంపచెట్లు

చిలుకూరు : మండల పరిధిలోని బేతవోలు గ్రామంలో గల రెండవ వార్డులోని ట్రాన్స్‌ఫార్మర్‌ను కంపచెట్లు కమ్మేశాయి. దీంతో నిత్యం లోఓల్టేజీ విద్యుత్ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని అనేకసార్లు లైన్‌మెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాకరు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రూ.60 వేల ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : సోలిపేట గ్రామానికి చెందిన తలారి శంభయ్య ఇటీవల గుండెపోటుతో మరణించారు. దీంతో సోలిపేట గ్రామంలోని యూపీఎస్‌లో 1985–86 సంవత్సరం 7వ తరగతి బ్యాచ్‌కు చెందిన అతడి స్నేహితులు విరాళాలు సేకరించి మిత్రుడి కుటుంబానికి రూ.60వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ బ్యాచ్‌లో ఎవరికి ఆపద వచ్చినా వెంటనే ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ర వెంకట్‌రెడ్డి, కర్ర సత్తిరెడ్డి, మారపాక వెంకన్న, చెరుకు నాగభూషణం, చెరుకు మల్లయ్య, చందా లక్ష్మణ్‌బిట్టూ, బోడ వెంకన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతిని జయప్రదం చేయాలి



ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : జూన్ 1న నిర్వహించబోయే హనుమాన్ జయంతి వేడుకలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందపురంలో గల శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. హనుమాన్ జయంతి రోజు సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కె.వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్‌రెడ్డి, కోల నాగేశ్వరరావు, బి.శ్రీనివాస్, అంజిరెడ్డి, పిచ్చయ్య, వీరబాబు, ఆదినారాయణ, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ అజయ్‌కుమార్

నడిగూడెం : గెలుపోటములను సమానంగా తీసుకోవాలని నడిగూడెం ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ అన్నారు. నడిగూడెం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడలు ఐక్యతకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో బహుమతుల దాతలు సిరిపురం, నడిగూడెం మాజీ సర్పంచ్‌లు వెంపటి రామారావు, నూనె ఇందిర, పసుపులేటి జనార్దన్, నిర్వాహకులు మొలుగూరి సతీష్, పందిటి వంశీ, నాయకులు మొక్క శ్రీను, పల్లపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పేలా ఎన్నికల ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు

హుజూర్‌నగర్ : మతతత్వ బీజేపీకి బుద్ధి చెప్పేలా పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వస్తాయని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్ష పార్టీలు బలపరిచిన అభ్యర్థులు గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2న అమరవీరుల సంస్మరణ దినోత్సవం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుండు వెంకటేశ్వర్లు, ఇందిరాల వెంకటేశ్వర్లు, కృష్ణ, పద్మ, వెంకన్న, శ్రీనివాస్, వెంకయ్య, స్టాలిన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఫొటోగ్రాఫర్లకు చేయూత అందించాలి



ఫొటోగ్రాఫర్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న రాపర్తి శ్రీనివాస్ గౌడ్

కోదాడరూరల్ : ఆపదలో ఉన్న ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వం చేయూత అందించాలని ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కోదాడ పట్టణానికి, మండలంలోని దొరకుంటకు చెందిన ఇద్దరు ఫొటోగ్రాఫర్లు అనారోగ్యంతో బాధపడుతుండటంతో వారికి మంగళవారం కుటుంబ భరోసా నిధి నుంచి రూ.10వేల చొప్పున ఆర్థికసాయం అందజేసి మాట్లాడారు. ఫొటోగ్రాఫర్లందరూ ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామని అన్నారు. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్‌లను గుర్తించి రూ.5లక్షల ఉచిత ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కుంకుంట్ల లాలు, కోదాడ అధ్యక్షుడు పిల్లుట్ల వెంకట్, ప్రధాన కార్యదర్శి మరికంటి లక్ష్మణ్, గొట్టం రవి, నగేష్, ఉపేందర్, సప్తగిరి, వాసు, శ్రీరామ్, శ్రీను, హరీష్, రమేష్, అహ్మద్ ఉన్నారు.

అనుమతులు లేని స్కూళ్లను రద్దు చేయాలని వినతి

భానుపురి : సూర్యాపేట జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య స్కూల్స్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, స్కూల్స్‌ను రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్ డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న స్కూళ్లను సీజ్ చేయాలని మంగళవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో డీఈఓ అశోక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని నేరేడుచర్ల, బీబీగూడెం దగ్గర సీబీఎస్‌ఈ సెంట్రల్ స్కూల్‌కి ఎలాంటి అనుమతి లేకుండా శ్రీ చైతన్య యాజమాన్యం నడిపిస్తోందన్నారు. ప్రతిసారి అనుమతులు లేకుండా శ్రీ చైతన్య విద్యాసంస్థల కొత్త బ్రాంచిలను ప్రారంభిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని తెలిపారు. వాటిపై చర్యలు తీసుకోకుంటే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సూరం విజయ్ రెడ్డి, వీరబాబు పాల్గొన్నారు.

సామూహిక జన్మదిన వేడుకలు



సన్మానిస్తున్న సంఘం సభ్యులు

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో మే నెలలో జన్మదిన వేడుకలు జరుపుకున్న పెన్షనర్లను సంఘం మండల అధ్యక్షుడు దండా శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వి.రాములు, తాటికొండ శంభయ్య, గులాం హుస్సేన్, బురహానిద్దీన్, హైమావతి, రాఘవరెడ్డి, రాములులను సంఘం సభ్యులు పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, కోశాధికారి జి.సోమయ్య, వి.రాములు, కె.సురేందర్‌రెడ్డి, బి.వీరయ్య, జి.అశోక్, ఏ.నరేందర్‌రెడ్డి, కె.లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందమూరి తారక రామారావుకు ఘన నివాళి



హుజూర్‌నగర్: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



కోదాడరూరల్ : టీడీపీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న ఓరుగంటి ప్రభాకర్ తదితరులు

హుజూర్‌నగర్ : టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలను మంగళవారం హుజూర్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రోషపతి, వెంకటేశ్వర్లు, వంశీ, రాములు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

కోదాడ పరిధిలో..

కోదాడరూరల్ : కోదాడ పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామాల్లో సినీ నటుడు, మాజీ సీఎం స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఓరుగంటి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఎస్వీ జూనియర్ కళాశాలలో టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉప్పగండ్ల సరోజశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ముత్తినేని సంధ్యారాణి, జనపనేని కృష్ణారావు, చాపల శ్రీను, కొండ సోమయ్య, సహదేవ్, సత్యనారాయణ, వెంకశ్వరరావు, మల్లికార్జున్, సురేష్, లక్ష్మీనారాయణ, నాగుల్ తదితరులు ఉన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు దొంతగాని శ్రీను, నాయకులు గుండు నాగేశ్వరరావు, పల్లపు నాగేశ్వరరావు, ఎస్‌కె.జహీర్, దేవరంగుల వీరన్న, పిచ్చయ్య, రఫీ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : మండల కేంద్రంలో మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని మంగళవారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డా గురవయ్య, నాయకులు కొల్లు నర్సయ్య, కొండా సోమయ్య, కొల్లు సత్యనారాయణ, మరీదు శ్రీను, భాస్కర్, మస్తాన్, నాగరాజు, వీరబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : నందమూరి తారక రామారావు జయంతిని మంగళవారం నేరేడుచర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కట్ చేసి పంపిణీ చేశారు. ఎన్టీఆర్ అభిమానులు పాల్వాయి రమేష్, సుంకరి క్రాంతికుమార్, సుబ్బారావు, శ్రీనివాస్‌రావు, కిరణ్, చిట్టిబాబు, సురేష్, నారాయణ, రవి, నాగభూషణం, ప్రదీప్తి, అనిత, పుల్లయ్య, సైదులు తదితరులు ఉన్నారు.

మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్

గరిడేపల్లి : తెలుగువారి ఆత్మగౌరవాన్ని నలు దిశల చాటిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరామారావు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పాతకోట లింగారెడ్డి, మండల అధికార ప్రతినిధి మర్రి రాములు ముదిరాజ్, యనమదల రామచందర్‌రావు, పాతకోట శ్రీనివాసరెడ్డి, మాచర్ల రవి, నకిరేకంటి సైదులు, తోడేటి వెంకటేశ్వర్లు, పెండెం వెంకటరాములు, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మునగాలలో..

మునగాల : నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను మంగళవారం మండలం కేంద్రలో టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు నాదెళ్ల గోపాల్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు జంగిలి గోపి, గాడిపర్తి మోహన్‌రావు, దేవినేని రాఘవేందర్‌రావు, చలసాని మాధవరావు, మామిడి గురునాథం, వేట అశోక్, షేక్ సైదా, కాజెల్లీ, సైదులు, రఘు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

నర్సింహాపురంలో..

నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను మంగళవారం నర్సింహాపురంలో సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు చెరువుపల్లి గోపి, బారీ లక్ష్మయ్య, పుల్లూరి ఆదినారాయణ, కన్నెబోయిన విజయ్, వీరబోయిన శ్రీను, కేశబోయిన వెంకన్న, రేవూరి బాబు, అయినాల వాసు, అల్లి చినవెంకయ్య, షేక్ మన్సూర్, దాసోజు బ్రహ్మయ్య, కారింగుల పుల్లయ్య, వీరబోయిన వీరస్వామి, మాదాసు నరేష్, వీరబోయిన గుర్వయ్య, అక్కులు పాల్గొన్నారు.



మునగాలలో..



గరిడేపల్లి : ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అంజన్‌రెడ్డి, తదితరులు



నేరేడుచర్లలో కేక్ కట్ చేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు